

10.04.2022 -
శ్రీ కాళీవనాశ్రమములో
నిర్వహించిన
శ్రీరామనవమి
దృశ్యములు



శ్రీ సద్గురు పాద పూజ



సామూహిక కళ్యాణములు

# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా
ఫోన్ (0863) 2293645, 2293862, 2293206.
web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

**సంపాదక వర్గము**
మిస్. పి. ఇందిరాదేవి
డా॥ యమ్. స్వర్ణముఖి
సి.వి. రమణ బాబు
పి.యస్.ఆర్.కె. ప్రసాద్
కె. మురళీ మోహన వర్మ

సంపుటి 41 సంచిక 9
పేజీలు 44
మే 2022

5సం॥ల చందా రూ. 250
2సం॥ల చందా రూ. 120
సంవత్సర చందా రూ. 60
విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్ట్ Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ , A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి. M.O, బ్యాంక్ డ్రాఫ్ట్ పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు
గుంటూరు జిల్లా

Printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor PALURI SIVA RAMA KALI PRASAD

**ఈ సంచికలో** ............................... ....... **పేజీ**

దాశరథీ శతకము ............................ ..........4
శ్రీబాబూజీ ఉవాచ....................................... 5
అమ్మమాట.................................... ............ 7
అగస్త్య హృదయం ........................ ..............9
మనసు - మాయ........................... .............11
లక్ష్మీ నివాసం ..................... .........................13
శనీశ్వరునికి పట్టిన శని .........................15
నిజమైన సన్యాసి ..........................................17
బృందావనం అనుభూతి ..........................19
ఏది గొప్ప? ............................................................21
బరువులు................................. .........................25
కైవల్యోపనిషత్ ... ..........................................27
భక్తి జ్ఞాన వైరాగ్యాలు ..................................29
శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు .....................31
శ్రీ మాతా కళావతీ దేవి.............................32
మానవ జీవితం - ప్రశాంతత .................34
నిరీక్షణ ................................. .................................36
సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....38
విష్ణు కథలు ....... ........................... ..................40
ఉగాది సందేశం ............................................41

## **దాశరథీ శతకము** - భద్రాచల రామదాసు

22) **హాలికునకున్ హలాగ్రమున నర్థము చేకూరుభంగి దప్పిచే**
**నలమట జెందువానికి సురాపగలో జలమబ్బినట్లు దు**
**ర్మలిన మనోవికారినగు మర్త్యుని నన్నొడగూర్చి నీపయిన్**
**దలపు ఘటింపజేసితివి దాశరథీ కరుణాపయోనిధీ!**

భావం - రైతునకు నాగేటి చివర ధనమిచ్చినట్లు. దప్పికతో బాధపడువానికి గంగానదీజల మబ్బినట్లును, చెడు మనస్సు గల నాకు నీపై భక్తి కలుగునట్లు చేసితివి దాశరథీ కరుణా పయోనిధీ!




*గోపికలు బ్రహ్మదేవుని ఏమని దూషించారు?
*పాండురంగడు ఎవరి కీర్తనలు వ్రాశాడు?
*మధుర బాబు గురు తత్త్వాన్ని ఎందుకు అందుకోలేకపోయాడు?
*ఒకే ఫలాన్ని ఇచ్చే మూడు విత్తనాలు ఏవి?
*కుళ్ళిన బంగాళదుంపలు దేనికి సంకేతం?
*ఎక్కడ రిక్షా అబ్బాయి అడ్డు తొలగమనడానికి 'రాధే రాధే' అంటాడు?
*సన్యాసి వద్ద పడవవాడు ఎందుకు ధనం తీసుకోలేదు?
*హనుమంతుని శిరస్సుపైకి ఎక్కి కష్టాలు పడినదెవరు?
*ప్రేమ, ఆప్యాయతలు వుండే ఇల్లు ఏమవుతుంది?
*12సంవత్సరాల బాధను నాలుడు ఘడియలలో అనుభవించిన దెవరు?
*జడమైన మనుస్సను నడిపించేదెవరు?

*సమాధానాలు లోపలి పేజీలలో ............................*

# శ్రీ బాబూజీ ఉవాచ

- కీ.శే. పరాశర ప్రసాద్

1-2-1981

ఈరోజు ఉదయం 9గం.30ని॥లకు శ్రీ బాబూజీ భక్తులకు దర్శనం ఇచ్చారు. జాలయ్యగారికి విజయవాడలో ఏర్పాటు చేయదలచిన సత్సంగం గురించి ఎక్కువ హడావిడి చేయవద్దని చెప్పారు.



ముందుగా జాలయ్యగారు శ్రీ బాబూజీకి ఒక స్వీట్స్ పేకెట్ అందజేశారు.

భక్తులందరికీ శ్రీ బాబూజీ స్వీట్స్ ఇచ్చి తినమన్నారు. "ఎలా ఉన్నాయి?" అని అడిగారు.

'బావున్నాయి' అన్నాము.

"మనస్సు స్వచ్ఛంగా ఉంటే అన్నీ మధురంగానే ఉంటాయి" అని అన్నారు శ్రీ బాబు.

ఇది విన్న వెంటనే మా మనస్సులో ఒక ఆలోచన మెదిలింది. ఆ మధురత్వం, ఇచ్చిన వ్యక్తి మనస్సు స్వచ్ఛత వలన వచ్చిందా? లేక ప్రసాద భావంతో స్వీకరించిన వ్యక్తి మనస్సు స్వచ్ఛత వలన వచ్చిందా? రెండూ కరెక్టే అనిపించింది మాకు.

భగవానునికి ఏది ఎప్పుడు ఇవ్వాలో తెలుసు. "మీరు ఈ రోజు సమావేశానికి హడావిడి చేయకండి" అని అన్నారు జాలయ్యగారితో శ్రీ బాబు. ఈ వస్తువును తీసుకువెళ్ళి ఎంతవరకు ఉపయోగించుకోవాలో అంతవరకే ఉపయోగించుకోండి. అయిపోగానే ఇక్కడ దింపండి. అదే మీ బాధ్యత. అంతేకాని అక్కడ నన్ను 'అది తినండి', 'ఇది తినండి' అని విసిగించకండి. ఉపన్యాసం అయిన తరువాత నాకు అదే ఆలోచన వుంటుంది. అదే మననం చేస్తాను. ఏది ఎలా చెప్పాను? వీళ్ళకు ఏది ఎలా ఉపకరిస్తుంది?' అని.

నాకు ఒక గ్లాసులో కొబ్బరినీళ్ళు, మజ్జిగ చాలు. అంతగా కావాలంటే, కేరట్‌దుంప ఒకటి, అది ఉడికిందా? లేదా? ఉప్పు ఉందా?

కారం ఉందా? అనే ఆలోచన అవసరం లేదు. అది నా విచారణ కాదు. మళ్ళీ ఇక్కడికి వచ్చి స్నానం చేసి నివేదన చేసుకోవాలి. వచ్చిన భక్తులందరికీ ఏదో ఒక ప్రసాదం పెడితే చాలు. అంతేగాని భోజనాల గురించి ప్రయత్నం వద్దు. మీరు వచ్చిన వారందరికీ భోజనాలు పెట్టాలా? వద్దా? పెడితే ఎంత అవుతుంది? పోనీ 50 మంది వుండవచ్చు అనే ఆలోచనలో ఉన్నారు. నిజమా? కాదా?" అని అడిగారు శ్రీ బాబు.

'నిజమే' అన్నారు జాలయ్యగారు.

"నేను చెప్పవలసింది చెప్పాను, తరువాత మీ ఇష్టం. మీకు సందర్భాన్ని బట్టి ఎలా తోస్తే అలా చెయ్యండి. మీ సభ్యులందరి పేర్లు ఒక రిజిష్టర్లో వ్రాసి, నెలకొకసారో సంవత్సరానికోసారో కలుసుకొని సంకీర్తన చేస్తే ఎంత బాగుంటుంది? ఆ తర్వాత ఉపన్యాసం పెట్టుకోవచ్చు. ఆ వుపన్యాసం, సంకీర్తన అక్కడైన పెట్టుకోవచ్చు. లేకపోతే ఇక్కడైనా పెట్టుకోవచ్చు. భగవానుడికి తెలుసు ఎప్పుడు ఎవరికి ఏం అందివ్వాలో. ఇక్కడ నా దగ్గర ఉంటేనే మీకు నా కృప అందుతుందని అనుకోకండి. ఎంత దూరాన ఉన్నా నా కృప అందిస్తాను. గురుకృపకి కాలము, దూరముతో పనిలేదు. ఎక్కడ ఉన్నా ఒకటే.

నా భక్తులు ఎంతమందో ఎక్కడెక్కడో దేశవ్యాప్తంగా ఉన్నారు. వారందరికీ నా కృపారసాన్ని అందించటంలేదా? మేము ఇక్కడ చాలా కాలంనుంచి ఉంటున్నాము అని అనుకోవటం పొరపాటు. మధురబాబు రామకృష్ణ పరమహంస దగ్గర మొదటనుంచి ఉన్నాడు. అయితే ఏం సాధించగలిగాడు? ఏమైనా అనుభూతులు పొందగలిగాడా? కాని మధ్యలో ఎప్పుడో వచ్చాడు వివేకానందుడు. జుర్రుకున్నాడు గురుతత్వాన్ని. మధురబాబు గురుదేవుని నామాన్ని ధనార్జనకే వినియోగించాడు. కాబట్టి గురుతత్వాన్ని అందుకోలేకపోయాడు.

రమణమహర్షి దగ్గర ఒక శిష్యుడు ఉండేవాడు. ఆ శిష్యుని గులాబీమొక్క దగ్గరకు తీసుకువెళ్ళి కలుపు తీసేవాడు. అంత పవిత్రమైన, అందమైన గులాబీకి కలుపు తీస్తేనే ఆ అందం నిలుస్తుంది అన్నట్లుగా, నీలో ఆ విధంగానే ఉన్న సంకల్పములు అనబడే కలుపును తీసివేస్తేనే ఆనందమును పొందుతావు అన్నట్లుగా ప్రయోగాత్మకంగా బోధించేవాడు.

- సశేషం

## అమ్మ మాట

- జపమాలా ప్రసాద

***ఆటాడి ఆడకుండు***

గురు విద్య, లేక బ్రహ్మ విద్య చాలా నిగూఢమైనది. అది అత్యంత పవిత్రమైనది. అందుకనే గీతాచార్యుడు దానిని **రాజవిద్యా, రాజగుహ్యం పవిత్రం ఇదముత్తమమ్**' అని పేర్కొన్నాడు.

మరి ఇంత నిగూఢమైన తత్వాన్ని గుర్తించడం ఎలా? దానిని గ్రహించడానికి వీలు లేకుండా ఇంద్రియాలని పెట్టాడు. కనుక అది ఇంద్రియాలకు అగోచరమైనది. అయినా కూడా, ఆ ఇంద్రియాలని నడిపించేది ఆ శక్తే. మనం బయట విషయాలను గుర్తించాలంటే ఇంద్రియాలు కావలసినదే. కానీ ఆ ఇంద్రియాలకి స్వయం సత్తా లేదు. పంచ జ్ఞానేంద్రియాలు మనకు బయట ప్రపంచాన్ని గుర్తించడానికి అవసరం అవుతున్నాయి. కంటి ద్వారా చూస్తున్నాం; చెవుల ద్వారా శబ్దాలు వింటున్నాం; నాసికేంద్రియం ద్వారా వాసనలు తెలుసుకుంటున్నాం; నాలుక ద్వారా రుచిని, త్వగింద్రియం అంటే చర్మం ద్వారా స్పర్శని అనుభవిస్తున్నాం. ఈ గోళకాలకి స్వయం సత్తా లేదని ముందే చెప్పుకున్నాం.



ఈ శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలని పంచేంద్రియాలు మనసు ద్వారా గ్రహిస్తున్నాయి. అదే భగవద్గీతలో భగవానుడు ఇలా చెప్పాడు ... **శ్రోత్రం, చక్షుః, స్పర్శనం చ రసనం, ఘ్రాణమేవ చ అధిష్ఠాయ మనశ్చాయమ్ విషయాన్ ఉపసేవతే** - కనుక మన జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు పని చేయాలంటే మనస్సు కావాలి. అందుకనే, శ్రీబాబూజీ మహరాజ్ ఇంద్రియాలన్నిటికీ మెయిన్ స్విచ్ మనస్సు అని చెప్పేవారు. అయితే జడమైన ఆ మనస్సుని కూడా నడిపించేవాడు హృషీకేశుడు. ఆయన శుద్ధ చైతన్య రూపంలో వుండి, మన సర్వేంద్రియాలను, మనస్సును నడిపిస్తూ మనలోనే వుంటాడు. 'ఆటాడి ఆడకుండును, ఆటాడించేటి వాడు అతడేరా కర్త! అన్నిటికినీ అచలమూ కర్త!

మనందరం తోలుబొమ్మలాట చూసే వున్నాం. ఆ తోలు బొమ్మల కదలికలతో మనకు కథ అంతా నడుస్తూ వుంటుంది కానీ, వాటిని ఆడించేవాడు తెర వెనుక, లేక పైన వుంటాడు. వాడు ఆడిస్తేనే ఈ బొమ్మలన్నీ కదులుతాయి. ఎన్ని కథలైనా వస్తాయి! కానీ ఆ ఆడించేవాడు లేకపోతే ఏమీ వుండదు. అదే విధంగా, మన లోపలే చైతన్య రూపంలో వుంటూ, జడమైన మన శరీరాలను, ఇంద్రియాలను కదిలిస్తూ ఈ జగన్నాటకాన్ని నడిపిస్తున్నాడు ఆ జగన్నాటక సూత్రధారి అయిన భగవానుడు.

- సశేషం

## శ్రీ మాతాజీవారి సత్సంగ కార్యక్రమములు

**శ్రీకాళీ వనాశ్రమము హైదరాబాద్ శాఖలో**
**9-5-2022 నుండి 14-5-2022 వరకు**
**సత్సంగ కార్యక్రమాలు జరుగును.**

**శ్రీకాళీవనాశ్రమము, నంబూరు వ్యవస్థాపక దినం**
**స్వర్ణోత్సవాల సందర్భంగా**
**నంబూరు, శ్రీకాళీవనాశ్రమములో**
**16-5-2022 నుండి 18-5-2022 వరకు**
**సత్సంగ కార్యక్రమాలు జరుగును.**

**శ్రీకాళీవనాశ్రమము బెంగుళూరు శాఖలో**
**27-5-2022 నుండి 29-5-2022 వరకు**
**సత్సంగ కార్యక్రమాలు జరుగును.**

# అగస్త్య హృదయం

(గత సంచిక తరువాయి) - వారణాసి కాళీ ప్రసాద్ U.S.A

17. **జయాయ జయ భద్రాయ హర్యశ్వాయ నమోనమః।**
**నమో నమ స్సహస్రాంశో ఆదిత్యాయ నమో నమః॥**

**తాత్పర్యము** -

జయములను, శుభములను చేకూర్చువాడవు, ఆకుపచ్చని రథాశ్వములు కలవాడవైన భాస్కరుడా! నీకు నమస్కారము. వేల కొలది కిరణ సమూహములను కలిగిన ఆదిత్యుడా! నీకు నమస్కారము.

**జయాయ జయ భద్రాయ** - అంటూ తమ శిష్యుల యొక్క జయమును, శుభమును ఆకాంక్షిస్తూ గురుదేవులు చూపించే అవ్యాజమైన కరుణనీ, ఆర్తినీ అగస్త్యులు ఈ శ్లోకంలో వర్ణిస్తున్నారు. (**సమరే చింతయాస్థితమ్**)రణరంగంలో చింతాక్రాంతుడైన శ్రీరాముని జయము కోరివచ్చిన అగస్త్యుల ఆగమనమే దీనికి గొప్ప నిదర్శనము. మొదటి శ్లోకములో వివరించుకున్న విధంగా ఇది గజేంద్రమోక్షంలో శ్రీ మహావిష్ణువు యొక్క రాకను పోలి వుంటుంది. ఈ విషయాన్ని నిరూపిస్తూ, శ్రీబాబూజీ మహరాజ్‌వారు తమను ఆశ్రయించిన వారిని రక్షిస్తూ ప్రసాదించిన అనుభవాలు అనేకం. మరి జగద్గురువుల అవతారంలో **యోగక్షేమం వహామ్యహం** అని వారు చేసిన వాగ్దానము కూడా అదే కదా! అయితే ఆ యోగక్షేమములను పొందే అర్హతకు కావలసిన అనన్య చింతననూ, పర్యుపాసననూ (**అనన్యాశ్చిన్తయన్తోమాం యే జనాః పర్యుపాసతే**) ఎంతవరకూ చేయగలుగుతున్నామన్నది ఎవరికి వారే వేసుకోవలసిన ప్రశ్న!

మరి కొంత పరిశీలిస్తే **జయాయ జయ భద్రాయ** అన్న ప్రస్తావనతో అగస్త్యులు సాధకుడు శత్రువర్గములైన కామక్రోధాది గుణముల మీద విజయం సాధించి, సాధనా క్రమములో కలిగే అభివృద్ధిని రక్షించుకోవలసిన బాధ్యతను కూడా గుర్తు చేస్తున్నారు. అది కేవలం గురుదేవుల కృప వలన మాత్రమే సాధ్యమవుతుంది. సద్గురుదేవుల దివ్య నామములోని **ఓం జయినే నమః, ఓం భద్రాయ నమః** అనే నామములు ఈ విషయాన్ని సూచిస్తాయి.

**హర్యశ్వాయ నమో నమః** - శబ్దము శ్రీ గురుదేవులనే మనను గమ్యమునకు చేర్చగలిగే రథసారథులుగా గుర్తించాలని తెలియజేస్తోంది.

**నమో నమః సహస్రాంశో ఆదిత్యాయ నమో నమః** అంటూ అగస్త్యులు ఆదిత్యుడిని విరాట్పురుషుని రూపంగా ఆవిష్కరిస్తున్నారు. **సహస్ర శీర్షం దేవం విశ్వాక్షం విశ్వశంభువం** అని మంత్రపుష్పంలో నారాయణుని కొలవడంలోనూ, **సహస్ర శీర్ష వదనా, సహస్రాక్షీ, సహస్రపాత్** అని నారాయణి అయిన అమ్మవారిని స్తుతించడములోనూ వున్న భావము కూడా అదే! అనంత ముఖములతో, అనంత బాహువులతో విరాజిల్లే విశ్వరూప సందర్శనమును గురుపరమాత్మలో దర్శించాలన్నది దీని అంతరార్థము. రామదాసులవారు వివరించినట్లు **'అనంత రూపమున వింతలు సలిపేది'** తన గురురాముడే అని సాధకుడు గుర్తించాలి.

సర్వభూతములకూ తానే ఆధారమని గీతాచార్యులు వివరిస్తూ **అవిభక్తంచ భూతేషు విభక్తమివచ స్థితం** అంటూ అవిభక్తమైన నేనే సకల ప్రాణులలో వేరువేరుగా వున్నట్లు కనిపిస్తానని శలవిచ్చారు. అంతేకాక, **ఏకాంశేన స్థితో జగత్** అని వివరింపబడినట్లు సమస్త జీవకోటికీ ఆధారమైనది పరమాత్మ యొక్క ఒకే అంశ అనీ అది కేవలం తన గురుదేవుల అంశయే అని ప్రతి సాధకుడూ గ్రహించాలన్నది ఈ శ్లోకము యొక్క సారాంశము.

- సశేషం



# మనసు - మాయ

(గత సంచిక తరువాయి)

- వేలమూరి రవికుమార్

ఇలా పన్నెండు సంవత్సరాలు గడిచిపోయాయి. తీవ్రమైన కరువు వచ్చింది. గూడెంలో ఒకరినొకరు పీక్కు తినే పరిస్థితి వచ్చింది. లవణమహారాజు ఇహ తాను అక్కడ వుండలేక, భార్యబిడ్డలతో సహా వలస బయలుదేరాడు. కాస్త దూరం చేరేసరికే చిన్న కొడుకు తనకు ఆకలిగా వున్నదని, రక్తమాంసం కావాలని ఏడ్చాడు. వాడికి సర్దిచెప్పి కొంత దూరం నడిపించగా, ఇహ నడవలేనని, ఆహారం కావలసినదేనని పట్టుబట్టి ఏడుస్తూ గోల చేయడం ఎక్కువైంది. తన భార్యవైపు చూడగా ఆమె అక్కడ వున్న పచ్చి ఆకులు తిని గుర్రుపెట్టి నిద్రపోతోంది. దానితో లవణమహారాజు తాను చనిపోతే, వీళ్ళకి తన శరీరం పచ్చిమాంసం ఆహారంగా వుపయోగపడుతుందని నిర్ణయించుకుని అక్కడ చితి రగిల్చి అందులో దూకాడు.

అక్కడ అగ్నిలో దూకడమే తడవుగా ఇక్కడ లవణమహారాజు సింహాసనం మీద నుండి ఒక్క కుదుపుతో ముందుకు పడబోయాడు. వెంటనే ఆయన పరివారం ఆయన పడిపోకుండా గట్టిగా పట్టుకుని ఆపారు. రాజుగారితో వారు 'మహారాజా! మీరు గత నాలుగు ఘడియల నుండి అచేతనంగా పడి వున్నారు. మీకు ఏమైందోనని కంగారు పడుతున్నాము. భగవంతుని దయతో మీరు తిరిగి స్పృహలోకి వచ్చార'ని చెప్పారు.

అప్పుడు లవణ మహారాజు ఇంద్రజాలికుణ్ణి అతని ఇంద్రజాల విద్యలో నేర్పరితనం గురించి పొగిడి, అతనిని కానుకలు తీసుకోమని కోరగా అతను వద్దని చెప్పి అంతర్థానమైపోయాడు! తనకు ఇలాంటి అనుభవం ఎందుకు కలిగిందని రాజు (జరిగినది అంతా సభలో వివరించి చెప్పి) ప్రశ్నించాడు. సభలోని వారంతా అక్కడ వున్న వశిష్ఠుడి వంక చూశారు. వశిష్ఠులవారు తమ దివ్య దృష్టితో విషయం గ్రహించి లవణ మహారాజుకు ఇలా వివరించి చెప్పారు.......

'ఓ రాజా! నీవు రాజసూయ యాగం చేయదలచావు. కానీ, దాని వలన కలిగే విపత్కర పరిస్థితులకు భయపడి ఒక సంవత్సరకాలం రాజ్యం వదిలిపెట్టి, మానసిక యాగం చేశావు. రాజసూయ యాగం

పూర్తి అయిన తరువాత చేసినవారు 12 సంవత్సరాలు మానసిక, శారీరక బాధలు పడవలసి వస్తుంది. ఆ వచ్చిన ఇంద్రజాలకుడు దేవేంద్రుడి సేవకుడు. ఇంద్రుడు తమపై కరుణతో ఆ రాజసూయయాగ అనంతరం అనుభవించ వలసిన కర్మను తమరు మానసికంగా అనుభవించేలాగా చేసి అట్టి కర్మ నుండి తమను విముక్తులను గావించాడు' అని చెప్పాడు.

వశిష్ఠుడు చెప్పిన దానికి రాజుకు సంతృప్తి కలుగక తిరిగి ప్రశ్నలు సంధించాడు. 'గురుదేవా! పన్నెండు సంవత్సరాల బాధను నాలుగు ఘడియలలో అనుభవించడం ఎలా సాధ్యం?' అన్నాడు. దానికి వశిష్ఠుడు 'తపస్సంపన్నులు, మహాత్ములైనవారు పెద్ద పెద్ద కర్మశేషాలకు చిన్నపాటి అనుభవం కలుగజేసి దానిని తప్పించగలరు. ఇది వారికి గల తపోశక్తిపై ఆధారపడి వుంటుంది. ఇంద్రుడు మహాతపస్వి, మహాత్ముడు కనుకనే నీ కర్మను అలా తొలగించగలిగాడు' అని చెప్పాడు.

- సశేషం



# లక్ష్మీ నివాసం

సేకరణ - ఎమ్. జానకిరామ శాస్త్రి

ఒకసారి లక్ష్మీదేవి ఒక వ్యక్తి పై కోపగించుకొని "ఈ ఇంటినుండి వెళ్ళి పోతున్నాను. ఇక మీ ఇంటికి దరిద్ర దేవత రాబోతుంది. కాకపోతే నీకో వరం ఇవ్వదలచుకొన్నాను. అడుగు!" అని అన్నది.

అప్పుడు ఆ వ్యక్తి లక్ష్మీదేవితో ఇలా అంటాడు "అమ్మా! నీవు వెడుతుంటే ఆపే శక్తి నాకు లేదు. అలాగే దరిద్రదేవత వస్తుంటే ఆపే శక్తి అంతకన్నా లేదు. మీలో ఒకరు వున్నచోట ఒకరు వుండరు. కాబట్టి దరిద్ర దేవత వచ్చిన వేళలో కూడా మా ఇంటిలో ఇప్పుడు ఒకరిపట్ల ఒకరికున్న ప్రేమాభిమానాలు అలాగే వుండేటట్లు వరం ఇవ్వమ"ని అడిగాడు. 'తథాస్తు!' అని లక్ష్మీదేవి ఆ ఇంటినుండి వెళ్ళిపోయింది.



కొన్నిరోజుల తర్వాత ఇంటిలో వంట చేస్తున్న ఆ వ్యక్తి భార్య కూరలో ఉప్పు, కారం సమపాళ్ళలో వేయమని కోడళ్ళకు చెప్పి గుడికి పోతుంది. కొంతసేపటికి చిన్న కోడలు ఉప్పు, కారం కూరలో వేసి ఏదో పనిలో నిమగ్నమై పోతుంది. ఇంకొంతసేపటికి పెద్దకోడలు వచ్చి కూరలో ఉప్పు వేశారో లేదో అని అనుమానం వచ్చి తను కూడ ఆ కూరకు తగినంత ఉప్పు వేసి వేరే పనిలో పడిపోతుంది. ఇంతలో అత్తగారు వచ్చి కోడళ్ళు ఇద్దరు తమ పనిలోపడి ఉప్పు వేశారో లేదో అని తనూ కొంత వేస్తుంది.

మధ్యాహ్నం ఆవ్యక్తి భోజనం చేసే సమయంలో కూరలో ఉప్పు ఎక్కువయిందని గ్రహించి దరిద్ర దేవత ఇంటిలోకి ప్రవేశించిందని తెలుసుకుంటాడు. ఏమీ మాట్లాడకుండా తిని లేస్తాడు. కొంత సేపటికి ఆ వ్యక్తి పెద్దకొడుకు కూడ భోజన సమయంలో ఉప్పు ఎక్కువ అయిందని గ్రహించి 'నాన్న గారు తిన్నారా?' అని భార్యను అడిగాడు. 'తిన్నారు!' అని చెప్పింది. దానితో 'నాన్న ఏమీ అనకుండా తిన్నాడు.

నేనెందుకు అనాలి?' అని ఏమీ మాట్లాడకుండా తనూ తిని లేస్తాడు. ఇలా ఆ ఇంటి వాళ్ళంతా భోజనం చేసి వంట గురించి మాట్లాడకుండా వుంటారు.

ఆరోజు సాయంత్రం దరిద్ర దేవత ఆ వ్యక్తి దగ్గరకు వచ్చి 'నేను ఇక్కడ ఉండలేను వెళ్ళిపోతున్నాను. ఉప్పు కషాయం అయిన వంట తిని కూడా మీ మధ్య ఏ స్పర్ధలు రాలేదు. మీరు ప్రేమగా ఐకమత్యంగా వున్నారు. ఇటువంటి చోట నేనుండలేను!' అని చెప్పి వెళ్ళిపోతుంది.

దరిద్ర దేవత వెళ్ళిపోవడంతో ఆ ఇంట మళ్ళీ లక్ష్మీదేవి నివాసం ఏర్పరచుకొంటుంది. కనుక, ఏ ఇంటిలో 'ప్రేమ, అప్యాయతలు మరియు శాంతి' కళకళలాడుతూ వుంటాయో ఆ ఇల్లు 'లక్ష్మీనివాసం' అవుతుంది.

## *పెదనింత్రకాలను శాఖలో కార్యక్రమాలు*

* ***ప్రతి గురువారము అన్నార్తులకు, సాధువులకు అన్నదానం జరుగును*** *

**మే 2022**

6 శుక్ర - శ్రీ శంకర జయంతి - శ్రీ సద్గురు పాదపూజ

16 సోమ - (వైశాఖ) గురుపూర్ణిమ - శ్రీ సద్గురు పాదపూజ

25 బుధ - శ్రీ గురుదశమి; హనుమజ్జయంతి - సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ

**జూన్ 2022**

14 మంగళ - జ్యేష్ఠ పూర్ణిమ - శ్రీ సద్గురుపాదపూజ.

23 గురు - శ్రీగురుదశమి - శ్రీ సద్గురుపాదపూజ.

# శనీశ్వరునికి పట్టిన శని

సేకరణ - దాసరి ఆనంద్

ఏ జాతకంలోనైనా శనీశ్వరుడు ఏడున్నర సంవత్సరాలు వుంటే ఆ కాలాన్ని "ఏలిన నాటి శని" అంటారు. ఏలిన నాటి శని ప్రభావం త్రిమూర్తుల మొదలు సామాన్యుల వరకు తప్పనిసరిగా వుంటుంది. ఒకానొక సమయంలో హనుమంతునికి కూడా శని కాలం దాపురించింది. వానర వీరులంతా రాముడికోసం సేతువు నిర్మిస్తున్న సమయంలో శనీశ్వరుడు రామేశ్వర సముద్ర తీరానికి వచ్చాడు. అక్కడ వానరులందరూ సేతువు నిర్మాణానికి పెద్ద పెద్ద రాతి బండలను తీసుకుని వచ్చి సముద్రంలో పడవేస్తున్నారు. హనుమంతుడు పెద్ద బండలను ఏరి పెడుతున్నాడు.

శ్రీ రాముడు ఒక బండ మీద ఆశీనుడై పర్యవేక్షిస్తున్నాడు. అప్పుడు శనీశ్వరుడు రామునివద్దకు వచ్చి "నేను హనుమంతుని పట్టుకొనేకాలం వచ్చింది." అని శ్రీ రాముని అనుమతి అడిగాడు. 'నన్నెందుకు అనుమతి అడగడం నీ విధిని నీవు చెయ్యి' అని అన్నాడు శ్రీ రాముడు.

హనుమంతుని వద్దకు వెళ్ళి శని "నేను నీ వద్ద ఏడున్నర సంవత్సరాలు ఉండబోతున్నాను." అన్నాడు శనీశ్వరుడు. "నేను రామ కార్యంలో నిమగ్నమైయున్నాను ఇప్పుడంత కాలం కుదరదన్నాడు హనుమంతుడు. "సరే ప్రస్తుతానికి ఏడున్నరమాసాలు వుంటాను, సరేనా" అన్నాడు. అందుకు కూడా హనుమ ఒప్పుకోలేదు....ఏడున్నర వారాలు .. అంటూ కాల ప్రమాణం తగ్గించుకుంటూ వచ్చాడు శనీశ్వరుడు.

హనుమంతుడు, రామనామం ఆపకుండా జపిస్తూనే చివరకు ఒక ఏడు క్షణాల కాలం తనను పట్టుకోవలసిందిగా కోరాడు. అప్పుడు శనీశ్వరుడు "నీ కాళ్ళలో ప్రవేశించనా" అని అడిగాడు. హనుమంతుడు "వద్దు ...సేతువు కట్టడానికి రాళ్ళను తేవాలి .. పరిగెత్తాలన్నా, నడవాలన్నా కాళ్ళు అవసరం" అన్నాడు. "సరి, నీ చేతులు పట్టుకోనా" అన్నాడు శనీశ్వరుడు. ఆ రాళ్ళని చేతులతోనే కదా మోసి తెస్తున్నాను. చేతులు పట్టుకోవద్దు. అన్నాడు హనుమంతుడు. "అయితే, నన్ను ఏం

చెయ్యమంటావు? నీ భుజాల పైన ఎక్కమంటావా" అన్నాడు శనీశ్వరుడు. "రామలక్ష్మణులను నా భుజాల మీద ఎక్కించుకుని వెడుతున్నాను. అందువలన భుజాలు ఎక్కడానికి వీలులేదు" అన్నాడు హనుమంతుడు. "పోనీ, నీ హృదయం లో వుండవచ్చునా?" అని అడిగాడు శనీశ్వరుడు. "ఈ హృదయంలో, మహాలక్ష్మీరూపిణి అయిన సీతాదేవి, నా దేవుడైన శ్రీరాముడు నిరంతరంగా నివసిస్తూ వున్నారు అక్కడ నీకు చోటు లేదు" అన్నాడు హనుమ.

"సరే, చివరకు నీ శిరస్సు ఒక్కటే ఖాళీగా వున్నది. అక్కడే వుంటాను" అని శనీశ్వరుడు, హనుమంతుని శిరస్సు పైన ఎక్కి కూర్చున్నాడు. హనుమంతుడు ఒక పెద్ద బండరాయిని తన శిరస్సు పై (అంటే శనీశ్వరుని మీద) పెట్టుకుని ఒక్కొక్క బండను సముద్రంలో వేయడం మొదలెట్టాడు. ఆ బండరాళ్ల బరువును మోయలేక శనీశ్వరుడు కళ్ళుతేలేసాడు. మరో పెద్ద బండరాయిని హనుమ తన శిరస్సుపై పెట్టుకోగానే, శనీశ్వరునికి ఊపిరి సలపక గిలగిలలాడాడు. హనుమంతుడు ఆ రాయిని సముద్రంలో వేసిన మరుక్షణమే శనీశ్వరుడు హనుమ శిరస్సుపైనుండి కిందకి దూకేశాడు. "మారుతీ! నీ వల్ల నాకు శ్రీ రాముని సేవించుకునే భాగ్యం కలిగినది . నీవు సకల శక్తులకు అతీతుడవైన రామభక్తుడవు. నీ ముందు నా శక్తిచాలదు. నిన్ను నేను పట్టలేను, నన్ను వదిలిపెట్టు మహానుభావా!" అంటూ చేతులెత్తేసి ఒకే పరుగుపెట్టాడు శనీశ్వరుడు.

హనుమంతుని ముందా కుప్పిగంతులు! నిర్మల భక్తితో, నిశ్చల మనస్సుతో శ్రీ రాముని సేవలో నిమగ్నమైయున్న ఎవరిని కూడా శనీశ్వరుడు రెండు క్షణాలు కూడా పట్టుకొనలేడు. పరిపూర్ణమైన నమ్మకంతో నిరంతరం శ్రీరామనామం జపిస్తే కష్టాల నుండి విముక్తి కలిగి తీరుతుంది. రామనామమే మోక్షసాధనం!!

# నిజమైన సన్యాసి

ఒక పడవ నడిపేవాడు ప్రతిరోజూ ఒక సన్యాసిని నదికి ఒక ఒడ్డు నుండి మరొక ఒడ్డుకు తీసుకువెళ్ళేవాడు. ప్రతిఫలంగా సన్యాసి నుండి ఏమీ తీసుకునేవాడు కాదు. అతను చాలా సాధారణమైన వ్యక్తి, చదువుకోకపోయినా, ఎలాంటి అవగాహనా లోపం లేదు. సన్యాసి మార్గమధ్యంలో జ్ఞానసంబంధమైన విషయాలను అతనితో పంచుకునేవాడు, కొన్నిసార్లు సర్వాంతర్యామి  అయిన భగవంతుని గురించి మాట్లాడేవాడు, మరికొన్ని సమయాల్లో శ్రీమద్భగవద్గీత శ్లోకాలను అర్థంతో సహా పఠించేవాడు. చేపలు పట్టే పడవవాడు  చాలా శ్రద్ధగా వినడం వల్ల, ఆ మాటలు అతని హృదయంలో నాటుకునేవి.

ఒకరోజు, నది ఆవలి తీరానికి చేరుకున్నప్పుడు, ఆ సన్యాసి పడవ నడిపే వ్యక్తిని తన గుడిసె వద్దకు తీసుకెళ్ళి, ఇలా అన్నాడు: "నాయనా! నేను ఇంతకు ముందు ఒక వ్యాపారిని, చాలా డబ్బు సంపాదించాను, కానీ నా కుటుంబాన్ని ఒక విపత్తు నుండి కాపాడుకోలేకపోయాను. ఇప్పుడు ఈ డబ్బు నాకు పనికిరాదు, నువ్వు తీసుకో. అది నీ జీవితాన్ని మారుస్తుంది. నీ కుటుంబం కూడా బాగుపడుతుంది."

పడవవాడు ఇలా చెప్పాడు, "అయ్యో! అయ్యవారూ, నేను ఈ ధనం తీసుకోలేను, ఉచితంగా ధనం ఇంట్లోకి ప్రవేశించిన వెంటనే, అది అందరి స్వభావాలను నాశనం చేస్తుంది, ఎవరూ కష్టపడరు, సోమరితనం జీవితంలో దురాశను, పాపాలను పెంచుతుంది. భగవంతుని గురించి మీరే నాకు నేర్పించారు. మీరు 'సర్వాంతర్యామి' అని పిలిచేదాన్ని నేను ఈ మధ్య అలలలో కూడా చూస్తున్నాను. నేను ఆయన దృష్టిలో వున్నప్పుడు నేను ఎందుకు అవిశ్వాసంగా ఉండాలి? నా పని నన్ను  చేసుకోనివ్వండి, మిగిలినది ఆయనకే వదిలివేయండి."

ఈ కథ ఇక్కడతో ముగుస్తుంది, కానీ ఒక ప్రశ్నను వదిలివేస్తుంది! ఈ రెండు పాత్రలలో సన్యాసి ఎవరు? దుఃఖం వచ్చినప్పుడు సర్వస్వాన్ని విడిచిపెట్టిన ఒక వ్యక్తి ఉన్నాడు - కాషాయ వస్త్రాలు ధరించి, అన్నీ త్యజించి, ధార్మిక గ్రంథాలను అభ్యసించి, కంఠస్థం చేసి, వాటిని వివరించే స్థితికి కూడా చేరుకున్నాడు. అయినా ధనాన్ని

వదిలిపెట్టలేక, అది ఇవ్వడానికి అర్హత ఉన్న వ్యక్తి కోసం వెతుకుతున్నాడు.

మరోవైపు, పేద పడవవాడు ఉన్నాడు. ఉదయం భోజనం చేసిన తర్వాత, తన తరవాతి భోజనం ఎక్కడ నుండి వస్తుందో కూడా అతనికి తెలియదు, అయినప్పటికీ మరొకరి సంపదపై కోరిక లేదు. ప్రాపంచిక వ్యవహారాలలో మునిగిపోయి ఉన్నా కూడా నిర్లిప్తంగా, బంధవిముక్తుడై ఉన్నవాడు. అతను కాషాయం ధరించలేదు, ఏదీ త్యజించలేదు, కానీ దివ్యశక్తిపై అతని విశ్వాసం ప్రబలంగా, స్థిరంగా ఉంది. అతను శ్రీమద్భగవద్గీత సారాన్ని అర్థం చేసుకోవడమే కాకుండా, దానిని ఆచరణాత్మక జీవితంలో ఎలా అన్వయించుకోవాలో నేర్చుకున్నాడు. ప్రాపంచిక సంపద యొక్క బంధాన్ని క్షణంలో తిరస్కరించాడు. మనస్సును సమతుల్యం చేసుకోవడమే నిజమైన సాధన.

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

**కార్యక్రమాలలో ఏమైనా మార్పులు వుంటే ఎప్పటికప్పుడు హైదరాబాద్‌శాఖవారి వాట్సప్ గ్రూప్‌లో తెలుపబడును......**

**మే 2022**

6 శుక్ర - శ్రీ శంకర జయంతి - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ
16 సోమ - (వైశాఖ) గురుపూర్ణిమ - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ
25 బుధ - శ్రీ గురుదశమి; హనుమజ్జయంతి - సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ

**జూన్ 2022**

14 మంగళ - జ్యేష్ఠ పూర్ణిమ - సత్సంగం, శ్రీ సద్గురుపాదపూజ
23 గురు - శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీ సద్గురుపాదపూజ.

# బృందావనం అనుభూతి

-డా॥ పి. సుధారాణి

మా వారు ఢిల్లీ దగ్గర ఘజియాబాద్‌కి సి.పి.ఆర్ శిక్షణ ఇవ్వడానికి నెల క్రితం వెడుతుంటే, మధుర - బృందావనం యాత్ర చేయవచ్చునని నేను కూడా బయలుదేరి వెళ్ళాను. ఘజియాబాద్‌లో శిక్షణ పూర్తి అయ్యాక, శ్రీకృష్ణజన్మభూమిలో రెండురోజులు వుండి, దగ్గర లోనే వున్న బృందావనం, గోకులం, గోవర్ధనగిరి, రాధారాణి జన్మస్థలమైన బర్సానా చూడడానికి ప్లాన్ వేసుకున్నాము. ఒక వారం రోజుల ముందు నుంచే హెూలీ ఉత్సవం కూడా కలిసి, భక్తజన సందోహం చాలా సంతోషంగా భగవంతునితో కలిసి పండుగ చేసుకుంటున్నారు.

అన్నిటిలోనూ నా జీవుడికి మధురాతి మధురమైన అనుభూతి బృందావన క్షేత్ర అనుభూతి. రాధాకృష్ణ అనుభూతి. భౌతిక విషయానందంతో పోల్చి చూడలేనిది. వాక్కుతో వర్ణించలేనిది. గురుదేవులు బోధలో చెప్పినట్లు ప్రతి ఇసుక రేణువు కృష్ణరసంతో నిండి వుంటుంది. ఆ మట్టిలోపడి దొర్లినప్పుడే ఆ రసానుభూతి ఏమిటో తెలుస్తుంది అని ఒక మహాత్ముడు అన్నారు.

ప్రధాన ఆలయంలో వున్న బాంకే బిహారి మూర్తి నా బుద్ధిలో వున్న త్రిగుణాలనే వంకరలను తొలగిస్తున్నాడా అన్నట్లు వేణువు ఊదుతూ నిలబడి వుంటాడు. నిధివనం లేక తులసిధామ్ (రాసలీల జరిగిన స్థలం) లో అడుగు పెట్టగానే మన మనస్సు టైమ్ మెషీన్‌లో వెళ్ళినట్లు 5000 సం॥ వెనక్కి వెళ్ళిపోతుంది. వెదురుతో చేయబడిన ఆవరణలో నుండి మనం నడుస్తూ వెడుతుంటే ఇరువైపులా అనేకమంది గోపికలు స్థూలమైన దృష్టికి తులసి వృక్షాలవలె కనబడతారు. ఆ వృక్షం వింతగా ఒక యువతి నాట్య భంగిమలో నిలబడినట్లే వుంటుంది. ఆ గోపికలు పగలు తులసి చెట్ల వలె నాట్య భంగిమలో అచలంగా వుంటారు. రాత్రి కాగానే, నా వంటి అపవిత్ర శరీరాలు దూరం వెళ్ళగానే, అసలు రూపం పొంది, రాధాదేవితో కలిసి, కృష్ణునితో రాసక్రీడ జరుపుతారు.

అనన్య భక్తకోటికి చెందిన చైతన్య మహాప్రభువు వలె మన ఆత్మ అనుసంధానం కాగలిగితే, ఆ వేణునాదం యొక్క రసంలో మునక వేయగలుగుతాము. ఆ వేణు నాదమే సమస్త సృష్టి యందు వ్యాపించిన

ఓంకారం. పరాభక్తికోటికి చెందిన గోపికలు, మూడు శరీరాలను దాటి భౌతిక శ్రవణేంద్రియానికి అందని ఆ దివ్యనాదంతో అనుసంధానమై చేసే నాట్యమే రాసలీల. జయ గోవింద బృందా విహారీ .......... వారి ఆత్మ పరమమైన ఆత్మలో లీనం అవడం అదే జీవన్ముక్త స్థితి. అదే నిధి పెన్నిధి.

అక్కడ సామాన్య జనులు కూడా రాధా కృష్ణమయంగా గోచరమయ్యారు. రిక్షా అబ్బాయి ఇతరులను అడ్డు తొలగమని చెప్పడానికి 'రాధే రాధే' అంటాడు. టీ షాపు వ్యక్తి మనకి టీ ఇవ్వడానికి రాధేకృష్ణ చాయ్ లేలో భయ్యా! అంటాడు. కొంతమంది స్త్రీలు గోపికల వలె అలంకరించుకుని రిక్షాలో వెడుతుంటే, కొంతమంది యువకులు శ్రీకృష్ణుని వలె తయారయి, సైకిల్ త్రొక్కుతూ కనిపిస్తారు. అందరి నుదుటిపై తిరునామం. చెంపలపై రాధే, రాధే అను అక్షరాలు. సామాన్య జనుల లోనికి రాధా కృష్ణులు. వారికి దృక్ దృశ్య వివేకమంటే ఏమిటో తెలియదు. బ్రహ్మసత్యం జగన్మిథ్య అంటే ఏమిటో తెలియదు. కానీ ఒకటి మాత్రం రూఢిగా తెలుసు. సర్వత్రా ఉన్నది కృష్ణుడే అని. అంటే **ఏకమేవ అద్వితీయం బ్రహ్మ!** అని తెలిసినట్లే కదా! అంటే అంతకు ముందు జన్మలలో వారికి కఠిన సాధనలు, విచారణలు పూర్తి అయిపోయాయన్న మాట! అనిపించింది.

ఆలయాలలో కూడా మంత్రాలతో అభిషేకాలు లేవు. సహస్ర నామాలతో పూజలు లేవు. హోలీ రంగులు రాధాకృష్ణులపై జల్లుతూ రాధే రాధే , కృష్ణ కృష్ణ అని మైమరచి నాట్యం చేసే అమాయకమైన భక్తి ఆ బృందావనవాసులది. మధురమైన గానంతో మూడు పూటలూ హారతి మాత్రం చక్కగా ఇస్తారు.

అట్టి దివ్య క్షేత్రంలో నడయాడినప్పుడు ఆ కృష్ణశక్తి, లేక గురుశక్తి నాలోని ఆవరణలను తొలగించి బృందావన వాసులవలె మధుర భక్తిలో తేలియాడేటట్లు అనుగ్రహించమని ఆ గురుదేవులని వేడుకున్నాను.


ఏది గొప్ప?
మధుప
విశ్వామిత్ర మహర్షీ! నా దృష్టిలో భగవంతుని చేరటానికి అన్నిటికంటే సత్సంగమే గొప్పది.
కాదు వశిష్ఠ మహర్షీ! తపస్సే అన్నిటికంటే గొప్పది.
1


పదండి, త్రిమూర్తుల వద్ద తేల్చుకుందాం!
2


బ్రహ్మదేవుడు సత్సంగంలో ఉన్నారు. ఆయన సత్సంగమే గొప్పదంటారు. మనం కైలాసానికి వెళ్దాం.
3


పరమేశ్వరుడు తపస్సులో ఉన్నారు. ఆయన తపస్సే గొప్పదంటారు. మనం వైకుంఠానికి వెళ్దాం.
4


నారాయణుడు యోగనిద్రలో ఉన్నారు. ఓ ఆదిశేషా! ఇక మా సందేహాన్ని తమరే తీర్చాలి.
5


తప్పకుండా! మీలో ఎవరైనా కొద్దిసేపు ఈ భూభారాన్ని వహిస్తే, నేను చెప్పగలుగుతాను.
నేను నా తపశ్శక్తిని ధారపోస్తున్నాను. ఈ భూమి నిలుచుగాక.
6


లాభంలేదు విశ్వామిత్రా!
సరే నేను వశిష్ఠుల వారితో చేసిన సత్సంగపు మహిమను ధారపోస్తున్నాను. ఈ భూమి నిలుచుగాక.
7


తపస్సు కన్నా సత్సంగమే గొప్పదని భలే నిరూపణ అయ్యింది కదా! ధన్యవాదాలు ఆదిశేషా!
8

# బరువులు

- జయప్రద

ఒక స్కూల్ లో ఒక టీచర్ తన క్లాస్ పిల్లలకి ఏదైనా విషయం చెప్పేటప్పుడు అది ప్రాక్టికల్‌గా పిల్లల జీవితంలో ఉపయోగపడేది చెప్తారు. అలా ఒక స్కూల్ లో ఒకసారి టీచర్ పిల్లలందరికీ ఇలా చెప్పారు... రేపు మీరు రోజులో ఎవరి వల్ల అయినా కోపం వచ్చినా, బాధ పడినా వాళ్ళ పేరుని ఒక బంగాళాదుంప మీద రాసి ఒక సంచిలో వేయండి. దాన్ని స్కూల్‌కి తీసుకుని రండి. నేను చెప్పినప్పుడు అవి నాకు ఇవ్వండి అని చెప్పారు. అందరు పిల్లలు సరే అని, ఇంటికి వెళ్లారు. టింకు ఏమో ఇంటికి వెళ్ళగానే వాడికి వాళ్ళ అక్కతో గొడవ అవుతుంది రిమోట్ కోసం ఇద్దరు కొట్టుకుంటారు. టింకుకి కోపం వస్తుంది. వెంటనే టీచర్ చెప్పింది గుర్తొచ్చి బంగాళాదుంప తీసుకుని అక్క పేరు రాసి స్కూల్ బాగ్ లో వేస్తాడు. తర్వాతి రోజు ఆ బాగ్‌ని స్కూల్‌కి తీసుకుని వెళ్తాడు. ఆ రోజు టీచర్ దానిగురించి ఏమీ అడగరు.

ఆ రోజు సాయంత్రం టింకుకి శాండీ అని వేరే పిల్లాడికి ప్లేగ్రౌండ్‌లో గొడవ అవుతుంది. టింకుకి కోపం వస్తుంది. ఇంకేముంది! బంగాళాదుంప తీసుకుని శాండీ పేరు రాసి బాగ్‌లో వేస్తాడు. ఇలా ఒక 5 రోజులు టింకు తనని బాధపెట్టిన వాళ్ళని, తనకి కోపం వచ్చిన వాళ్ళ పేర్లని రాసి ఆ సంచిని నింపుతాడు. ఇలా ఒక వారం గడుస్తుంది. టింకు బాగ్ దుంపలతో నిండి పోతుంది. మెల్లిగా దుంపలు అన్ని కుళ్ళి పోయి, రసం కారడం మొదలవుతుంది. వాసన రావడం కూడా మొదలు అవుతుంది. ఫ్రైడే స్కూల్‌కి వెళ్ళాక అప్పుడు టీచర్, ఏది మీరు ఈ వారంలో ప్రోగుచేసిన బంగాళాదుంపలు ఇలా ఇవ్వండి అన్నారు. వెంటనే ఒక్కొక్కరు లేచి ఇస్తారు. కొందరికి 2 , 3 లేక 5 అలా ఉంటాయి. టింకుకి మాత్రం మొత్తం నిండి పోతుంది. వాసన వస్తుంది. అపుడు టీచర్ చెప్తారు. చూశారా! మనల్ని ఎవరైనా తిట్టినా, అవమానించినా, బాధపెట్టినా దాని గురించి కోపం తెచ్చుని, బాధపడి మనసులో మోయడం వలన, ఎంత బరువులు వస్తాయో. వాటిని అక్కడికక్కడే వదిలేయాలి. అలా మోసుకుంటూ తిరుగుతే అవి మనల్ని ఇంకా బాధ పెడతాయి అని. అప్పుడు తెల్సింది టింకుకి తను చేసిన తప్పు ఏమిటో.!

ఇందులో విషయం మన అందరికి అర్థం అయ్యేదే. రోజు వారి జీవితంలో జరిగేదే. టింకు చిన్న పిల్లవాడు కనుక టీచర్ అలా చేసి చూపించారు.

ముగ్గురు మనుషులు నది దాటడానికి వేచి చూస్తున్నారు. అవతల వొడ్డున ఒక మనిషి ఉన్నాడు. అతనిని చేరడానికి. ఆ ముగ్గురిలో ఒకరికి దగ్గర ఒక డైమండ్ ఉంది. దాన్ని పడవ నడిపే వాడికి ఇచ్చి, ఇదిగో బాబూ! ఇంద ఈ డైమండ్ తీసుకుని నన్ను ఆ ఒడ్డుకు చేర్చు అన్నాడు. వెంటనే పడవలో వెళ్ళిపోయాడు. ఆ ఒడ్డుకి త్వరగా చేరాడు. రెండో వాడు నా దగ్గర డబ్బులు లేవు, ఈత వచ్చు అని, గబ గబ ఈదుకుంటూ వెళ్ళిపోయాడు. మూడోవాడి దగ్గర, డబ్బులు లేవు, ఈత కూడా రాదు. ఇంకేంచేస్తాడు. ఎలుగెత్తి అవతలి ఒడ్డున ఉన్న వాడిని పిలిచాడు. 'బాబు నా దగ్గర ఏమి లేదు, అటు రాలేకపోతున్నా' అని. అవతల ఉన్నవాడు కరుణాసముద్రుడు. వెంటనే తానే స్వయంగా పడవతో వచ్చి ఈ మూడో వాడిని ఎక్కించుకుని తీసుకుని వెళ్ళాడు. ఇద్దరు హాయిగా కబుర్లు చెప్పుకుంటూ అవతల ఒడ్డుకి చేరారు.

- సశేషం



# కైవల్యోపనిషత్

(గత సంచిక తరువాయి)

- రేఖ

అందువల్ల ఆత్మస్వరూపులైన గురుదేవుల గురించి ఏమని చెబుతాం? వినడానికి ఆశ్చర్యంగా వుంటుంది. చూడటానికి ఆశ్చర్యంగా వుంటుంది. చెప్పడానికి ఆశ్చర్యంగా వుంటుంది. అసలు దాని గురించి ఆలోచించడానికే ఒకోసారి ఆశ్చర్యంగా వుంటుంది. ఎలా అందుకోవడం ఆ తత్వాన్ని? కేవలం గురుపాదాలు ఆశ్రయించి శరణాగతిని పొందటమే. ఆ పాదాలను విడిచిపెట్టకుండా వుండటవే శిష్యుని కర్తవ్యం. గురుదేవుడు ఎన్ని పరీక్షలు పెట్టినా సరే, ఏ విధంగా అనుగ్రహిస్తావో అని ఆశ్రయించాలి. ఎందుకంటే ఆ పాదం తప్ప వేరు మార్గం లేదు తరించడానికి. మానవ స్వభావాలతో వున్న వాళ్ళం కాబట్టి అందినంతలో చేయగలుగుతాం ఏదైనా ఈ తత్వ జ్ఞాన విషయంలో. అందనంత జ్ఞానం ఎలా పొందగలుగుతాం? ఈ మానవ లక్షణాలతో!

గురుశక్తికి ఆకార వికారాలు లేవు, జనన మరణాలు, పుణ్య పాపాలు లేవు, ప్రకృతి తత్వానికి సంబంధించినది కాదు అది. ఆ గురుశక్తి ఏక తత్వం, సహజ సమరసం (**రసోవై సః**). గురుదేవులు సహజ సమరసమే స్వభావంగా కలవారు. అది బ్రహ్మతత్వం, ఆత్మతత్వం. అటువంటి లక్షణాలు తత్వము కలవాడు గురుదేవుడు. అట్టి గురుదేవుడికి నమస్కరిస్తున్నానని పరమేశ్వరుడు పార్వతీదేవికి ఈ మంత్రంలో తెలిపాడు.

ఇదివరలో చెప్పుకున్న తత్త్వమేవ, త్వమేవతత్ అన్న దానికి సంబంధించిన తత్వం గురుదేవుడిది. అదే విషయం ఇంతలోతైన భావన సదాశివుడు పార్వతీదేవికి చెప్పినది, బ్రహ్మదేవుడు అశ్వలాయన మహర్షికి చెబుతున్నాడు. ఏమని? ఆ 'నేను' కు కళ్ళు లేవు కానీ అన్నిటినీ చూస్తుంది. గుర్తింపజేస్తుంది ఒక వస్తువుని. ఈ సందర్భంలో మాతాజీ శ్రీగురుదేవుల మాటను జ్ఞప్తికి తెచ్చుకున్నారు - ఒకసారి గురుదేవులు అన్నారు 'నేను చూస్తూనే వున్నాను నువ్వు ఏం చేస్తున్నావో' అని. అంతే! మాతాజీవారికి అది మహావాక్యమై వారిలో నిలిచిపోయి ఎంతో ధైర్యాన్ని ఇచ్చిందని చెప్పారు. చూసేవాడుండగా భయం ఎందుకు? ఆ చెయ్యి వదిలి పెట్టదు. మనది మార్జాల కిశోర న్యాయం.

పిల్లి ఈనగానే తన పిల్లలను ఏడుచోట్లకు తిప్పుతుందట. వాటిని తన నోటికి కరచుకుని, జాగ్రత్తగా తన పళ్ళతో దానికి గాయం కలగకుండా తీసుకువెడుతుందట. అప్పుడు పిల్లలకి బాధ్యత వుండదు. తమ బాధ్యత అంతా తల్లిదే. దీనికి వ్యతిరేకంగా మర్కట కిశోర న్యాయం ఉంది. కోతిపిల్ల తన తల్లికోతిని పట్టుకుని తిరుగుతుంది. అప్పుడు బాధ్యత పిల్లకోతిదే. అలాగే తండ్రి పిల్లవాడి చేతిని పట్టుకుని వానాలప్పా తిరిగితే (చినుకులు పడుతున్నప్పుడు) ఆ పిల్లవాడి బాధ్యత అంతా తండ్రిదే. తిరిగేటప్పుడు పడిపోకుండా తండ్రి చూస్తాడు. మర్కట కిశోర న్యాయంలో లాగా పిల్లవాడే తండ్రి చేయి పట్టుకుని తిరిగితే ఆ పిల్లవాడు సడలి, పడిపోయి దెబ్బ తగుల్చుకునే అవకాశం వుంటుంది.

గురుదేవులు ఆశ్రయం, అభయం ఇచ్చిన తరువాత వారు మన చెయ్యి పట్టుకున్నారు. వారు మనలను ఎప్పుడూ చూస్తూనే వున్నారు. అంటే అక్కడ ఒక వ్యక్తిగా వారిని చూడకూడదు. గురు దేవుల దృష్టి అనంతం. గురుదేవులు పట్టుకుని వున్నారు అనే లక్ష్యం కలిగి వున్నప్పుడు ఇతరత్రా ఇష్టం వచ్చినట్లు తిరగలేము మనం. (ఒకవేళ ఎవరికైనా అపోహ కలుగుతుందేమో - వారి రక్షణ వుంది కాబట్టి ఎక్కడైనా తిరగవచ్చునేమోనని, పైన చెప్పిన మాటలతో శ్రీ మాతాజీ సంశయ రహితం చేశారు). సారం అందిస్తున్న గురుదేవులను ఆశ్రయించాలి. వారు చెప్పినంత వరకూ విచారణ సాగుతూ వుంటే, ప్రపంచంలో వున్న జీవుడికి తనలో వున్న శివ స్వరూపం అనుభవించడం ఎంత? గురుతత్వం అవ్యక్త తత్వం.

- సశేషం

**ముఖ్య గమనిక**

మే నెలలో సంకల్పించిన శ్రీకాళీవనాశ్రమ స్వర్ణోత్సవ కార్యక్రమాలు ప్రస్తుత కరోనా పరిస్థితుల దృష్ట్యా నవంబర్ నెలకు మార్చబడినవి. మరిన్ని వివరాలు తరువాత తెలియజేయబడును.

# భక్తి జ్ఞాన వైరాగ్యాలు

- పాలూరి కాళీప్రసాద్

మోక్షం రావాలంటే జ్ఞానం కలగాల్సిందే అంటారు కొందరు. కాదు, భక్తియే మోక్షసాధనం అంటారు మరికొందరు. అసలు ఈ రెండిటికన్నా ముందు వైరాగ్యం కలగాలి కదా అంటారు ఇంకొందరు. అయితే జగద్గురు శ్రీ ఆదిశంకర భగవత్పాదాచార్యులవారు వివేక చూడామణిలో **'మోక్ష సాధన సామగ్ర్యాం భక్తిరేవ గరీయసీ'** - మోక్షం సాధించడానికి కావలసిన ఉపకరణాలన్నింటిలో భక్తియే అత్యుత్తమమైనదని నొక్కి వక్కాణించారు.

మామూలుగా మనం భక్తి అంటే పూజలు చేయటమో, ఉపవాసాలు ఉండటమో ఇటువంటి బయటి ఆర్భాటాలనే అనుకుంటాం కదా! అయితే ఇదే శ్లోకం రెండవ పాదంలో భక్తి అంటే ఏమిటో వారు నిర్వచిస్తున్నారు. **'స్వస్వరూపానుసంధానం భక్తిరిత్యభిధీయతే'** - నీయొక్క అసలు స్వరూపంతో నిత్యమూ అనుసంధానం కలిగి ఉండటమే భక్తి అనబడుతుంది.

అయితే నీ అసలు స్వరూపం ఏది? దానినే మనం "నేను" అంటున్నాం. ఈ నేనుకే సంస్కృతంలో "ఆత్మ" అని పేరు. అయితే ఇది మూడు రూపాలలో ఉంటుందని దక్షిణామూర్తి స్తోత్రం తెలియజేస్తోంది. **'ఈశ్వరో గురురాత్మేతి మూర్తి భేద విభాగినే వ్యోమవద్వ్యాప్త దేహాయ దక్షిణామూర్తయే నమః'** ఈశ్వరుడు, గురువు, ఆత్మ - ఈ మూడూ రూపంలో భేదమే కానీ అసలు వస్తువులో భేదం లేదనీ, ఆకాశంవలె సర్వత్రా వ్యాపించి ఉంటాయని తెలియజేస్తోంది. అంటే ఈ మూడూ మన స్వస్వరూపాలే అన్నమాట.

నిరంతరం ఈశ్వరుడితో మనస్సు అనుసంధానమై ఉండి సదా భగవధ్యానంలో ఉంటూ ఆయన సేవ తప్ప మరో విషయం మీదికి మనస్సు పోకుండా ఉంటే అదే భక్తి. అలాగే మనస్సు సదా ఆత్మతో అనుసంధానమై సర్వత్రా నిండియున్న ఆ ఆత్మనే ఎల్లప్పుడూ దర్శిస్తూ సర్వత్ర సమదృష్టి కలిగి ఉండటమే జ్ఞానం కదా! మరి గురువునే సర్వస్వంగా భావించి మానసికంగా సదా వారి సాన్నిధ్యంలోనే ఉంటూ

గురుబోధను నిరంతరం మననం చేసుకుంటూ ఆచరణలో పెట్టే సాధకునికి ఇతర విషయాలపై వైరాగ్యం దానంతటదే కలుగుతుంది కదా! అంటే ఆత్మయొక్క మూడు భిన్న రూపాలలో ఒక్కొక్క దానితో అనుసంధానం వలన మనకు భక్తి జ్ఞాన వైరాగ్యాలలో ఒక్కొక్కటి సహజంగానే కలుగుతున్నాయి.

ఆత్మయొక్క మూడు రూపాలకు రూపంలో తప్ప తత్వంలో భేదం లేనట్లే, ఆ ఆత్మతో అనుసంధానానికి రూపాలైన భక్తి జ్ఞాన వైరాగ్యాలలో కూడా భేదం లేదన్నమాట. శ్రీగురుదేవులు తరచుగా "గాఢమైన విశ్వాసమే భక్తి. భక్తియొక్క పరాకాష్టయే జ్ఞానం. జ్ఞానంయొక్క పరాకాష్టయే ముముక్షుత్వం" అని బోధించేవారు. ఇక్కడ ముముక్షుత్వం అంటే మోక్షం తప్ప మరేదీ అవసరం లేదనే వైరాగ్యమే కదా!

మనం ఒక బీజం నాటితే దానికి సంబంధించిన మొక్క మొలకెత్తి, వృక్షమై అటువంటి ఫలాన్నే ఇస్తుంది. మామిడి టెంక నాటితే మామిడికాయలే కాస్తాయి. మర్రి విత్తనం నాటితే మర్రి పళ్ళే కాస్తాయి. మరి శ్రీగురుదేవులు ప్రసాదించిన ఆశ్రమ నిత్యప్రార్థనలో "దీనబంధూ! దయానిధే! మా మనస్సు అచంచల విశ్వాసముతో నిరంతరము నీయందే నిలచియుండునట్లు అనుగ్రహింపుము. మాలో భక్తి జ్ఞాన వైరాగ్య బీజములు అంకురించి, పెంపొంది, ఆత్మానంద ఫలమును ఒసగులాగున ఆశీర్వదింపుము" అనే వాక్యాన్ని చేర్చారు.

ఇక్కడ కూడా మనస్సు అచంచల విశ్వాసంతో నిరంతరము భగవంతునితో అనుసంధానమై ఉండాలని, అలా ఉన్నప్పుడు మనలో భక్తి జ్ఞాన వైరాగ్య బీజాలు నాటుకొని, మొలకెత్తి ఆత్మానందమనే ఫలాన్ని ఇస్తాయని వివరిస్తున్నారు. అయితే ఈ మూడు వేరు వేరు బీజాలు అయినట్లైతే అలా మొలకెత్తిన వృక్షాలు ఒకే ఫలాన్ని ఇవ్వటం ఎలా సాధ్యం? కాబట్టి ఈ మూడు వేరువేరు కాదని, ఒకే భావనకు భిన్న అభివ్యక్త రూపాలని, వాటి పరమార్థం ఆత్మానందమేనని మనకు అర్థం అవుతోంది.

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు

**మే 2022**

3 మంగళ - అక్షయ తృతీయ - శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

6 శుక్ర - శ్రీ శంకరజయంతి - శ్రీబాబు బృందావనమూర్తి ప్రతిష్ఠా 27వ వార్షికోత్సవం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

14 శని - శనిత్రయోదశి

16 సోమ - వైశాఖ గురుపూర్ణిమ - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

20 శుక్ర - వైశాఖ బహుళపంచమి - శ్రీమహాకాళికాపరమేశ్వరీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామివారల ప్రతిష్ఠా వార్షికోత్సవం. రాత్రి 7గం.లకు సామూహిక లీలా కళ్యాణ మహోత్సవం.

25 బుధ - శ్రీ గురుదశమి; హనుమజ్జయంతి - సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ

28 - శని - మాస శివరాత్రి, శనిత్రయోదశి

30 - సోమ - అమావాస్య

31 - మంగళ - ఆశ్రమ వ్యవస్థాపక దినోత్సవం - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ

**జూన్ 2022**

8 బుధ - శ్రీసుగుణప్రసాద మాతాజీవారి పంచదశవార్షికారాధన. సత్సంగం.

14 మంగళ - జ్యేష్ఠ పూర్ణిమ - శ్రీసద్గురుపాదపూజ

23 గురు - శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ

27 సోమ - మాస శివరాత్రి

28 మంగళ - అమావాస్య

# శ్రీ మాతా కళావతి దేవి

సేకరణ - మురళీ

శ్రీ మాతా కళావతి దేవి కర్ణాటక రాష్ట్రం కార్వార్‌లో జన్మించారు. తండ్రి శాంతారామ్, తల్లి సీతాబాయ్. తల్లిదండ్రులు పుత్ర సంతానం కోరి దుర్గాష్టమి రోజున మహేశ్వరుని ఆశీస్సుల కోసం సహస్ర లింగార్చన చేశారు. అదే రోజు రాత్రి శాంతారాంకు కలలో దుర్గామాత దర్శనం ఇచ్చి, వారి కుటుంబంలో తన అంశతో ఒక బాలిక జన్మిస్తుందని వరం ఇచ్చింది. 1908వ సం॥లో భాద్రపద మాసంలో శుద్ధ పంచమి నాడు బాలిక జన్మించింది. ఆ బాలికకు రుక్మాబాయి అని పేరుపెట్టి పెంచుకోసాగారు.

రుక్మాబాయి ఎదుగుతున్న కొద్దీ ఆమె లోని దైవిక గుణాలు ఒక్కొక్కటీ ప్రస్ఫుటమవ్వసాగాయి. ఇది గమనించిన ఆమె తల్లిదండ్రులు తామెంతో అదృష్టవంతులమని భావించారు. వయస్సు పెరుగుతున్న కొద్దీ ఆమె వయస్సుకు మించిన పరిపక్వత, ఓర్పు, సహనము ప్రదర్శించేది. నిస్వార్థ బుద్ధితో ఇతరుల యందు దయగలిగి వుండేది. చిన్నా, పెద్దా అందరూ ఆమె సహచర్యాన్ని కోరుకునేవారు.

రుక్మాబాయి 3 సంవత్సరాల వయస్సు వున్నప్పుడు కుటుంబం గోకర్ణ క్షేత్రానికి వలస వెళ్ళిపోయింది. కుటుంబ నేపథ్యం మరియు పట్టణంలోని పవిత్ర వాతావరణం ఆమె ఆధ్యాత్మిక వృద్ధికి ఎంతో తోడ్పడ్డాయి. అయిదేళ్ళ వయస్సులోనే ఆమె మరాఠీ, కన్నడ, హిందీ, గుజరాతీ భాషలలో భజనలు పాడగలిగింది. ఆమె భక్తి, ఉత్సాహం మరియు శ్రావ్యమైన కంఠస్వరం సహజంగానే ప్రజలను ఆకర్షించాయి. అందువలన ఆమె భజనలు చేయడానికి, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు తరచుగా పిలుస్తూ వుండేవారు. ఆమె ఆటలు కూడా రాముడు, కృష్ణుడు బొమ్మలతోనే సాగేవి. సముద్ర తీరంలో ఇసుకతో పెద్ద శివలింగం చేసి గంటల తరబడి అభిషేకం, పూజ చేస్తూ వుండేది.

రుక్మాబాయి ఏడు సంవత్సరాల వయస్సులో స్వామి పూర్ణానంద సరస్వతి అనే స్వాములవారు వారి గృహానికి వచ్చి అక్కడే చాలా రోజులు వున్నారు. ఆ సమయంలో రుక్మాబాయి స్వామికి సకల సపర్యలు చేసి,

వారి మన్ననను పొందినది. స్వామి అక్కడి నుండి వెళ్ళే సమయంలో ఆమె నిత్యమూ పూజించుకోవడానికి కృష్ణుని మూర్తిని రుక్మాబాయికి ఇచ్చి, 'నీకు అత్యంత ప్రీతిపాత్రంగా భావించి, ఎల్లప్పుడూ నీ దగ్గరే వుంచుకుని పూజించుకో. నీ అభీష్టాలన్నీ నెరవేరుతాయి' అని దీవించారు. ఆమె తల్లిదండ్రులతో ఆ స్వామి 'మీ అమ్మాయి సాక్షాత్తు దుర్గాదేవి అవతారం. ఆధ్యాత్మిక కుసుమాలు వెదజల్లుతూ దీనజనోద్ధరణ కోసమే జన్మించింది' అని చెప్పి వెళ్ళిపోయారు.

రుక్మాబాయికి ఆ కృష్ణుని మూర్తి అత్యంత ప్రీతిపాత్రమైంది. నిరంతరం ఆ కృష్ణుని సేవలోనే నిమగ్నమై వుండేది. చిన్న పిల్లలను చేర్చుకుని వారికి పురాణ గాధలు చెబుతూ వుండేది.

15 సం॥ల వయస్సులో ఆమెకు దక్షిణ ఆర్కాట్ జిల్లాలోని కడూర్‌కు చెందిన పోలీస్ ఇన్‌స్పెక్టర్ శ్రీ రాజ్‌గోపాల్ మల్లాపూర్కర్‌తో వివాహం జరిగింది. ఇంటికి తిరిగి వెళ్ళేటప్పుడు కొత్తగా పెళ్ళి చేసుకున్న జంట హుబ్లీలో శ్రీ సిద్ధారూఢ స్వామి దర్శనం చేసుకుని, వారి ఆశీర్వచనం పొందారు. మొదటి దర్శనంలోనే స్వామివారిని తన గురువుగా స్వీకరించి, స్వామికి సాష్టాంగ నమస్కారం చేసి, ఆనంద బాష్పాలతో స్వామివారి పాదాలను అభిషేకించారు. ఆమె భక్తికి స్వామివారు ముగ్ధులై మంత్రదీక్షను ఇచ్చారు.

అత్తవారింట్లో రుక్మాబాయి స్వార్థరహిత సేవ చేసి అందరి మన్ననలను పొందినది. 17వ యేట ఆమెకు ఒక కుమారుడు కలిగాడు. తను రెండవసారి గర్భముతో వుండగా భర్త పరమపదించారు. ఈ పరిణామం రుక్మాబాయిని ఎంతో కృంగదీసింది. ఆధ్యాత్మిక మార్గంలో తాను ఎన్నో సాధించాలనుకున్నది. కానీ ఈ హఠాత్ పరిణామాన్ని ఆమె తట్టుకోలేక పోయింది.

ఇద్దరు పిల్లలతో తన జీవితం ఎలా గడుస్తుంది? గమ్యం ఎలా సాధించగలను? అని నిరుత్సాహపడి, తన జీవితాన్ని అంతం చేసుకోవాలనుకున్నది. ఆ సమయంలో గురుదేవులు ప్రత్యక్షమై ఆమెను ఆత్మహత్యా ప్రయత్నం నుంచి విరమింపజేశారు.

- సశేషం

# మానవ జీవితం – ప్రశాంతత

ఒక మహారాజు ఓ జ్ఞాని వద్దకు వెళ్లి "నేను ప్రశాంతంగా వుండలేక పోతున్నాను" అన్నాడు. "నువ్వు నీ బాధ్యతలు సరిగ్గా నిర్వర్తించడం లేదా?" అని అడిగారు. ఆ జ్ఞానియే అష్టావక్ర మహర్షి.

"మా రాజ్యానికి శత్రు భయం లేదు. దొంగల భయం లేదు. మా రాజ్యంలో పన్నులు తక్కువే. న్యాయ వ్యవస్థ కూడా బాగుంది. ఎక్కడా ఎవరికీ అన్యాయం జరగదు. ప్రజలందరూ ఆనందంగా వుంటున్నారు. కానీ నాకే ప్రశాంతత లేదు. నేను ఏం చెయ్యాలి" అని రాజు ప్రశ్నించాడు.

"సరే నీ బాధ అర్థమైంది. నేనొకటి చెప్తాను. అలా చెయ్యి. నీ రాజ్యాన్ని నాకు ఇచ్చేసేయ్" అన్నారు జ్ఞాని. "అంతకన్నా ఇంకేం కావాలి. తీసుకోండి. ఈ క్షణమే ఇచ్చేస్తున్నాను నా రాజ్యాన్ని" చెప్పాడు రాజు. "సరే నాకిచ్చావు, నువ్వేం చేస్తావు" జ్ఞాని అడిగారు. "నేను ఎక్కడికైనా వెళ్లి అక్కడ ఏదో ఒక పని చేసుకుంటూ బతుకుతాను" అన్నాడు రాజు.

"ఎక్కడికో వెళ్లడం ఎందుకు.. ఇక్కడే నా వద్దే నా ప్రతినిధిగా ఉండి నువ్వు చెయ్యవలసిన పనులు చెయ్యి. ఎందుకంటే నీకు పరిపాలన తెలుసు. చేయగల సమర్థుడివి, ఓ ఏడాది తర్వాత వచ్చి లెక్కలు వగైరా చూస్తాను" అని చెప్పారు జ్ఞాని.

ఒక సంవత్సరం గడిచింది, జ్ఞాని రాజుని చూడటానికి వచ్చారు. రాజు మొహంలో ఆనందం కనిపిస్తోంది. ఎక్కడా ఆవ గింజంత దిగులు కనిపించడం లేదు. జ్ఞానిని సాదరంగా ఆహ్వానించి సపర్యలు చేసి లెక్కలు చూపించాడు రాజు.

"ఆ లెక్కలు అలా పక్కన పెట్టు గానీ నువ్వు ఇప్పుడు ఎలా వున్నావు" అడిగారు జ్ఞాని. "హాయిగా ఉన్నాను. కావలసినంత ప్రశాంతత అనుకోండి. మునుపెన్నడూ ఇంత హాయిగా లేను. మీకు నా ధన్యవాదాలు" అన్నాడు రాజు. "సరేగానీ పూర్వం నువ్వు చేసిన పనులకు, ఇప్పుడు నువ్వు చేస్తున్న పనులకు ఏమైనా తేడాలు తెలిశాయా" అని అడిగారు జ్ఞాని. "లేదు, అప్పుడు చేసే పనులే ఇప్పుడు కూడా

చేస్తున్నాను" రాజు సమాధానమిచ్చాడు. "అప్పట్లో నువ్వు ఇది నా పని, నా బాధ్యత అని ఆలోచించావు. ఇప్పుడు నువ్వు ఇది నాది కాదు. నేనిక్కడ కేవలం ఒక ప్రతినిధిని అనుకున్నావు. ఆ మనసే అన్నింటికీ మూలం.

నేను అనే ఆలోచన వచ్చేటప్పుడల్లా అన్ని ఒత్తిడులూ, సమస్యలూ నీ చుట్టూ సుడులు తిరుగుతుంటాయి. అలా కాకుండా ఈ ప్రపంచం నాది కాదు. ఈ దేహం నాది కాదు. ఈ ఊపిరి నాది కాదు. ఇవన్నీ నాకు ఇచ్చినవే తప్ప నా సొంతం కావు. అని నువ్వు గ్రహిస్తే సమస్యలన్నీ బాధలన్నీ పారిపోతాయి. ఈ మానసిక స్థితితోనే నువ్వు పరిపాలించు. నీ విధులు నువ్వు సాగించు. నీకు కావలసినంత "ప్రశాంతత" లభిస్తుంది" అని అష్టావక్రముని భోధించారు.

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా ఈ క్రింది మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

***మే 2022 :*** AS 8537, 8726

***జూన్ 2022 :*** AS 7470, 7482, 7779, 8731-8736, 8739, 8746-8755, 8757-8764. LM 4335, 4337, 4338•

(గత సంచిక తరువాయి)

# నిరీక్షణ

తమిళ మూలం - శ్రీ ఆర్. సంపత్

తెలుగు అనువాదం - శశికళా దివాకర్

దశరథుని మాటలను విన్న విశ్వామిత్రుడు, తనలో ఉప్పొంగే ఆగ్రహావేశములను అణగద్రొక్కుకొని, "నీ సహాయ సహకారములు మాకు వద్దు అడిగింది ఇస్తానన్నావే? ఇప్పుడు ఇలా మాటలాడతావే? ఇదేనా నీ రాజధర్మము?" "చేసిన ప్రతిజ్ఞ నిలబెట్టుకోలేక, మాట తప్పిన ధర్మం తెలియని దశరథా! పుత్ర పౌత్రాదులతో సుఖంగా, శాంతిగా జీవించు" అని విశ్వామిత్రుడు 'వింటి నుండి వెలువడిన బాణంలాగ' వడివడిగ అడుగులు వేసుకుంటూ దశరథుని రాజసభనుండి నిష్క్రమించాడు.

రాజసభ ముఖద్వారమువద్ద ఆతడు, తనకు ఎదురుపడిన వశిష్ఠులను చూసిన వెంటనే వికసించిన పుష్పమువంటి వదనముతో పలకరించి, ఆయన పాదములకు వందనం చేశారు. వశిష్ఠులు, విశ్వామిత్రుని మనసారా ఆలింగనమొనర్చుకుని, "బ్రహ్మర్షీ! ఏ విషయమై మీరు అయోధ్యకు విచ్చేసారు? ఇలా ఆవేశంగా ఎక్కడకు వెడుతున్నారు? మీకు ఏదైనా కావాలా? సహాయపడ నేను ఆత్రుత పడుతున్నాను. నా వలన ఏ సహాయం కావాలో దయచేసి సెలవియ్యండి" అన్నారు కులగురువులైన వశిష్ఠులు.

విశ్వామిత్రుడు రాజసభలో జరిగిన విషయమంతటినీ వివరించిన పిమ్మట, వశిష్ఠులు, "అయ్యయ్యో. .....దశరథుడు తన పుత్రునిపై పెంచుకొనిన అపారమైన మమకారముచేత, మీ మూలంగా రామునకు కలుగబోవు ఉన్నతమైన కీర్తి, ఘనతలను గూర్చి గ్రహించలేకపోయాడు. మీరు లోనికి రండి... నేను ఆయనకు విషయమునంతటినీ వివరిస్తాను", అని బదులిచ్చి, విశ్వామిత్రునితో కలసి దశరథుని రాజ సభలోనికి ప్రవేశించారు. దశరథునితో వశిష్ఠులు, "ఆడిన మాట తప్పి, దశరథుడు అధర్ముడు! మాట తప్పినవాడు! అని అనిపించుకుంటావా? విశ్వామిత్రుడంటే ఎవరో తెలుసా?"

**ఏష విగ్రహవాన్ ధర్మ ఏష వీర్యవతాం వరః।**

**ఏష విద్య అధికో లోకే తపసః చ పరాయణం॥**

"ఈ లోకంలో ధర్మమంతయూ విశ్వామితుడు! ఈ లోకంలోని తపస్సుకంతటికీ ప్రతిరూపం ఆ విశ్వామిత్రుడు! ఈ లోకంలోని బుద్ధికంతటికీ నిర్వచనం విశ్వామిత్రుడు! శివుని అనుగ్రహంగా ధనుర్వేదమంతా ఆయనకు భాసించింది. కావున ఈ లోకంలో ఉన్న అన్ని అస్త్ర శస్త్రాలు ఆయనకు తెలుసు. ఇన్నింటిని తెలిసిన విశ్వామిత్రుడు తనను తాను రక్షించుకోగలడు. కాని రామునికి ఆ కీర్తి దక్కాలని, తనకు తెలిసిన ఆ విద్యలనన్నింటినీ రామునికి ధారాదత్తం చేయాలని ఆయన కోరిక. కావున రాముని ఆయనతో పంపించు". "సముద్ర జలము ఆవిరైపోయి మేఘముగమారి కురియు వర్షం వలన పెరిగిన వరదనీరంతయూ వెడలి పెద్ద కడలిలో కలసిపోవు విధమున మీ పుత్రుడైన రామునికి అలవిగాని సంఖ్యలో విద్యలన్నియూ తామే వచ్చి చేరు భాగ్యము ఈ దినమున లభించింది. ఇంతటి ఉన్నతమైన మేలు జరుగబోవు అవకాశమును చేజారవిడుచుకోవచ్చా?'' అని వివరించారు.

కులగురువుల మాటలతో కలత వీడిన దశరథుడు "పోయి, లక్ష్మీపతిని తీసుకొని రమ్ము! (సీత- శ్రీ మహాలక్ష్మి అవతారం; ఆమె భర్తయైన శ్రీ మహావిష్ణువే శ్రీరాముడు)" అని మంత్రి సుమంత్రునికి తెలియజేసిన కొన్ని క్షణములకు, యువరాజు రాముడు తన సహోదరుడైన లక్ష్మణునితో కలసి వారివద్దకు వచ్చాడు. వారిరువురినీ తీసుకునివెళ్ళవచ్చునను చిహ్నముగ విశ్వామిత్రులవైపు చూసాడు దశరథ మహారాజు. "ఒక మంచి తండ్రిని, మంచితల్లిని పొందిన నీవు ఈతనికి నీ తండ్రివలే సహాయమందించు" యని రామునితో చెప్పి వారిద్దరినీ ఆతనితో పంపించాడు.

విశ్వామిత్రుడి వెనక కోదండాలు పట్టుకుని వెడుతున్న రామ, లక్ష్మణులను వాల్మీకి మహర్షి, బ్రహ్మగారి వెనుక అశ్వినీ దేవతలు, స్థాణువైన శివుడి వెనుక విశాఖుడు, స్కందుడు వెళ్తున్నట్లుందని పోల్చి వివరించారు. వాళ్ళు అలా సరయూనది దక్షిణ తీరంలో కాలినడకన ఒకటిన్నర యోజనాలు ప్రయాణించాక చీకటి పడడంతో ఒక ప్రాంతంలో విశ్రమించదలచారు.

- సశేషం

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

## శ్రీ కొండ శేషంరాజుగారితో శ్రీబాబు

- కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

హేమ వివాహానికి సంబంధం కుదుర్చుకొన్న తరువాత కృష్ణవేణమ్మగారు గుంటూరులో ఉన్న శ్రీ బాబు వద్దకు వెళ్ళి, వివాహానికి తగిన ముహూర్తం నిర్ణయించమని ప్రార్థించారు. "శేషంరాజు గారు కూడా వస్తేనే ముహూర్తం నిర్ణయిస్తా"నని శ్రీ బాబు మెలిక పెట్టారు.



శ్రీ బాబు కేవలము భక్త జనోద్ధరణకై అవతారం ధరించి వచ్చిన వారు. ఎవరెవరిని తరింపచేయటానికి నిశ్చయించుకున్నారో వారింటికి తామే వెళ్ళి, ఎలాగో పరిచయం ఏర్పరచుకుని, ఆ కుటుంబంలోని ఏ ఒక వ్యక్తినో మిషగా చేసుకొని, ఆ కుటుంబమంతటిని తరింపజేయటమే వారి ప్రత్యేకానుగ్రహ పూర్వక కార్యాచరణ పద్ధతి. ఛైర్మన్ వెంకటరాజుగారు తమ యింట్లో వారికి ప్రధమంగా ఆతిధ్యమిచ్చారు గనుక, వారి కుటుంబమంతటిని తరింప జేయవలసినదే!

వెంకటరాజుగారి కుమార్తె నారాయణమ్మగారు శ్రీ బాబుకు పరమభక్తురాలు. ఆమె ప్రస్తుతం ఆశ్రమ స్థిరనివాసులై, శ్రీ బాబు దివ్య చరణ సన్నిధిలో గురుస్మరణ చేసుకుంటూ తమ జన్మను సార్థకం చేసుకుంటున్నారు.

ఛైర్మన్‌గారి కుమారుడు శేషంరాజుగారు మాత్రం అప్పట్లో యింకా శ్రీ బాబుతో సన్నిహితులు కాలేదు. ఆయన సన్నిహితులు కాకపోతే తామే వారికి సన్నిహితులై దగ్గర చేసుకోవాలి. అది శ్రీ గురుదేవుల నిర్హేతుక కరుణకు తిరుగులేని తార్కాణం. కుమార్తె వివాహ విషయంలో తన ధర్మపత్నికి, కుమార్తెకు సంతోషం కలిగించటం కోసమైనా, శేషంరాజుగారు శ్రీ బాబు వద్దకు రావటం తప్పలేదు. అది చాలు! ఇనుప ముక్క అయస్కాంతానికి దూరంగా ఉన్నంతసేపే దానికి స్వతంత్రం గాని,

ఒక్కసారి సన్నిహితమైతే యిక అతుక్కుని పోవటమే కదా!

కృష్ణవేణమ్మగారు యీసారి శేషంరాజుగారిని కూడా వెంట బెట్టుకొని శ్రీ బాబు వద్దకు వెళ్ళారు. శ్రీ బాబు "శేషంరాజుగారు! తమ దర్శనం నాకెంతో ఆనందాన్ని కలిగిస్తున్నది. నేను మొదటి సారిగా గుండుగొలను వచ్చినప్పుడు తమ తండ్రిగారు నాపై ఎంతో ప్రేమని వర్షించి ఆదరించారు. ఇప్పుడు తమరిని చూస్తుంటే మళ్ళీ వారే వచ్చినట్లున్నది. అటువంటి పెద్దలు తమరు వచ్చి కోరినప్పుడు, తమ ఆదేశమును కాదనగలనా?" అని శేషంరాజుగారిని దగ్గరకు తీసుకొని, విశ్వనాథం మామయ్యను పిలిచి ముహూర్తం పెట్టించి తమ ఆశీస్సులతో శేషంరాజు గారికిచ్చారు. "ఇంతటి ప్రేమ మూర్తికి నేను యింతకాలము దూరంగా ఉండిపోయానే" అని శేషంరాజు గారు విచలితులైపోయారు.

ఆ రోజులలోనే శేషంరాజు గారి రెండవ కుమార్తె గయ వివాహం కూడా మేనత్త నారాయణమ్మ గారి జ్యేష్ఠ పుత్రునితో జరపటానికి నిశ్చయించుకున్నారు. శ్రీ బాబు తామే కలుగ జేసుకొని "రెండవ కుమార్తె వివాహానికి కూడా అదే ముహూర్తము దివ్యంగా కుదిరింది. కనుక యిద్దరు కుమార్తెల వివాహాలు అదే ముహూర్తానికి ఒకేసారి జరపండి" అన్నారు.

శేషంరాజుగలికి పచ్చి వెలక్కాయ గొంతులో పడినట్టైంది. ఇద్దరు కుమార్తెల వివాహం ఒకేసారి జరపరాదనేది జగమెరిగిన శాస్త్రం. శేషంరాజుగారు ఆ మాటే శ్రీ బాబుతో అన్నారు. శ్రీ బాబు "మీరేమీ సందేహించకండి . నేను చెప్పినట్లు చేయండి. ఈ దంపతుల జీవితాలు సుఖశాంతులతో వర్ధిల్లగలవు. ఏమంటావు మామయ్యా?" అన్నారు. విశ్వనాథం మామయ్య "ఇక మీరు చెప్పిన దానికి తిరుగు లేదు బాబూ! పిడుగుకు వారశూల అడ్డం వస్తుందా ఏమిటి? 'శుభస్య శ్రీఘ్రం! ' అన్నారు. ఏ పూర్వపుణ్యవిశేషం వలననో శేషంరాజుగారికి శ్రీ బాబు ఆశీర్వచనంపై విశ్వాసం కలిగింది. సరేనన్నారు.

- సశేషం

## విష్ణు  కథలు

-రమణ ప్రసాద్

(గత సంచిక తరువాయి)

### జనాబాయి

భక్తులను ఉద్దేశిస్తూ "పరమ పవిత్రులారా! మీకు శతకోటి ప్రణామాలు. పాండురంగడు ఆర్తజన రక్షకుడు. భగవన్నామమే మానవులు తరించటానికి సులభమైన మార్గము. భగవన్నామం సదా చేస్తూ ఉండండి. మీరు మీ ఇళ్ళకు తరలిపోండి" అని ధ్యానమగ్నురాలైంది.



ఉరి తీయుటానికి ప్రారంభించారు. ఉరికంబం అదృశ్యమైంది. దాని స్థానంలో పుష్పపంక్తితో కూడిన లతలు వెలిశాయి. భక్తులంతా జయ జయ ధ్వానాలు చేశారు. అసూయా పరులంతా తలలు వంచుకున్నారు. పాండురంగని అపార ప్రేమాతిశయానికి పరవశించిన జనాబాయి కళ్ళవెంట ఆనంద భాష్పాలు వెల్లువగా ప్రవహించాయి.

జై జై పాండురంగ హరి!

ఒకనాడు పాండురంగడు ఏదో వ్రాస్తున్నాడు. జ్ఞానదేవులవారు స్వామీ ఏమిటి వ్రాస్తున్నారు? అని అడిగారు. జనాబాయి గానం చేసిన కీర్తనలను వ్రాస్తున్నాను అని చెప్పాడు. జనాబాయి కీర్తనలు మీరు వ్రాయవలసిన అవసరం ఏమిటి? అని జ్ఞానదేవులు ప్రశ్నించారు.

"జ్ఞానదేవా! జనాబాయి కీర్తనలను గానంచేసి తదనుగుణంగా జీవించువారు తప్పక నా పాద సన్నిధికి చేరుతారు. ఇది నా శాసనము" అని చెప్పారు. భగవంతుని అనంత కృపకు పాత్రురాలై తాను తరించటమే కాక ఇతరులు తరించటానికి మార్గదర్శి అయిన ఆమె జీవిత చరిత్ర పరమ పావనము, మోక్షదాయకము.

# ఉగాది సందేశం

- రమణ ప్రసాద్

శ్రీ సద్గురుదేవుల పరమానుగ్రహంతో మనం ప్లవనామ సంవత్సరం దాటి శుభకృత్‌లో ప్రవేశించాం. కాలం వేగంగా సాగిపోతోంది. జీవితంలో ఎన్నో చేదు అనుభవాలు, మధురానుభవాలు వస్తున్నాయి. వీటియందు సమదృష్టి కలిగి ఉండాలి. మహాత్ములు ఏం చెబుతున్నారంటే ఇంద్రియగోచరమైనవి అన్నీ పరిణామం చెందేవే. పరిణామం చెందనిది ఏదైతే ఉన్నదో అది మనలో ఉన్న చైతన్యమే. అదే ఆత్మ. దానివల్లే ఈ ఉపాధి ప్రకాశిస్తోంది. ఉపాధి మార్పు చెందేది. దానికి, **అస్థి, జాయతే, వర్ధతే, పరిణమతే, అపక్షీయతే, నశ్యతే** అనే షడ్భావ వికారాలు వున్నాయి. మనమందరం పంచాగ శ్రవణం చేశాం. మన రాశులలో వచ్చే దుష్పరిణామాలకి భయం కలుగుతోంది. కాని మనకి అభయమిచ్చిన గురుదేవులు మనకి ఏ కష్టాలు రాకుండా కాపాడుతారు.

**'సత్‌కీ నావ్ ఖేవటియా సద్గురు భవసాగర్ తరియాయో। రామ రతన ధన్ పాయో॥** (మీరా భజన) సత్యమనే నావలో మనం ఉన్నాం. నావను నడిపేవాడు సద్గురు దేవుడు. మనలని భవమనే సాగరాన్నుండి తరింపజేసి గమ్యస్థానం చేరుస్తాడు. మన గమ్యస్థానం ఏది? "ఏది వుంటే ఇది వచ్చిందో అదే తాను" అనే గమ్యానికి మనందరినీ చేరుస్తాడు.

శుభకృత్ వచ్చింది. రాబోయేది శోభకృత్. శుభకృత్ అంటే మంగళ కరము, శోభకృత్ అంటే సుందరమైనది. కాబట్టి ఈ రెండు సంవత్సరాలు శుభాలని చేకూర్చేవే. "నీ చెయ్యి నా చేతిలో ఉంది" అని మన గురుదేవులు తమ అండదండలు మనకి అనుగ్రహించారు.

ప్రతి విషయంలో మనం చేసే సద్భావనే మనకి మంగళకరమైన ఫలితాలని ఇస్తుంది. గురుదేవులు చెప్పినట్టు నడుచుకుంటే మనకి ఏ ఆపదా రాదు. శ్రీ గురుదేవులు మనకై అవతారం ధరించి వచ్చారు. అవ్యక్తంగా ఉంటూ మనకు రక్షణ ఇస్తున్నారు. మనస్సుకి పట్టిన మైలను కడుక్కోవాలి. భగవన్నామం నిరంతరం ఉపాసన చేస్తూ అనుక్షణం గురుబోధను విచారణ చేయాలి.

అట్టి ఉపాసన గోపికలు చేశారు. వారిని చూసి ఇంద్రాది దేవతలు ఈర్ష్య చెందారు. రెప్పపాటు కాలమైనా కృష్ణునితో వియోగం

సహించలేని గోపికలు, "మాకు ఈ కనురెప్పలు ఎందుకు ఇచ్చా"వని బ్రహ్మని దూషించారు. మన గురుదేవులు మనందరికీ ఇట్టి అనుభూతులు పుష్కళంగా ప్రసాదించారు.

గురు సన్నిధిలో ఉండి వారి బోధామృతాన్ని తనివితీరా గ్రోలుతుంటే ద్వంద్వానికి తావు లేదు. ఉన్నది ఒక్కటే సత్య పదార్థం అనే అనుభవం కలుగుతుంది. వివేక చూడామణిలో చెప్పినట్లు మనకి మానవజన్మ కలిగింది. మోక్షాసక్తి కలిగింది. సత్పురుషుల ఆశ్రయం లభించింది. గురుదేవులే మనలోని దేహ భావన తీసివేస్తారు. అదే నిజమైన సన్యాసం. కాలస్వరూపులైన గురుదేవులు మనని ఎప్పటికీ విడిచిపెట్టరు. వారి చేతిలో మన చెయ్యి ఉంది. వారే నడిపిస్తున్నారు. అట్టి అనుభూతిని కలిగి ఉంటేనే మానవజన్మ కలిగినందుకు చరితార్థం మవుతుంది. శ్రీ గురుదేవులు మనందరికీ అట్టి దివ్యానుభూతిని పొందే శక్తిని, భక్తిని ప్రసాదించెదరు గాక! సుఖీభవ!!

## శ్రద్ధాంజలి

శ్రీబాబు చిరకాల భక్తులు, భీమవరం వాస్తవ్యులయిన శ్రీ పాలూరి రామచంద్ర దుర్గాప్రసాదరావు గారు 29-3-22 మంగళవారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 90 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియ జేస్తున్నాము.

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD

10.04.2022 - శ్రీ కాళీవనాశ్రమములో నిర్వహించిన శ్రీరామనవమి దృశ్యములు



సీతారాముల కళ్యాణం చేస్తున్న కర్తలు



శ్రీ బాబూజీ మహరాజ్ వారికి మంగళహారతి



శ్రీ మాతాజీవారికి మంగళహారతి

Regd. News Magazine Periodical
Posted on 5th and 6th of every month

RNI No. 37804/81
Postal Regd. No.: GTR/27/2021-2023





శ్రీ కాళీవనాశ్రమంలో శుభకృత్ ఉగాది నాడు
జరిగిన సద్గురు పాదపూజ దృశ్యములు.

If undelivered please return to
**SAMARDHA SADGURU**
SRI KALI GARDENS
Ashramam-522 508, Guntur Dist., A.P.